క్లుప్తంగా

ఈక్రాప్ నమోదు తప్పనిసరి



ఈక్రాప్ నమోదును పరిశీలిస్తున్న రవీంద్రభారతి

సారవకోట: ప్రతిరైతు తాము సాగు చేస్తున్న పంటలను ఈ–క్రాప్ తప్పనిసరిగా చేయించుకోవాలని వ్యవసాయ శాఖ నరసన్నపేట ఏడీ రవీంద్రభారతి సూచించారు. బొంతు రైతు భరోసా కేంద్రం పరిధిలో వరి పంట పొలాలలో ఈ క్రాప్ నమోదును ఆమె శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. భవిష్యత్‌లో పంటలకు సంబంధించి ప్రకృతి వైపరీత్యాలకు వచ్చే నష్ట పరిహారాలు అందజేయాలంటే తప్పనిసరిగా ఈ క్రాప్‌లో నమోదు చేయాలన్నారు. పంటను కొనుగోలు కేంద్రాల్లో విక్రయించేందుకు ఈక్రాప్ అవసరమన్నారు. ఏవో కె.సి.హెచ్ వెంకటరావు, ఏఈఓ కంతయ్య, వీపీఏ శివకుమార్‌లున్నారు.

అంతర్గత అప్పులకే ప్రాధాన్యం



సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

ఆమదాలవలస రూరల్: మహిళా స్వయం శక్తి సంఘాల గ్రేడింగ్‌లో సభ్యుల మధ్య అంతర్గత అప్పులకు అధిక ప్రాధాన్యం ఉంటుందని ఏపీఎం పైడి కూర్మారావు అన్నారు. కలివరం గ్రామంలో స్వయంశక్తి సంఘం సభ్యులతో శుక్రవారం సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. స్వయంశక్తి సంఘాలు, గ్రామ సంఘాల్లో సొంత నిధులను పూర్తిగా వినియోగించుకున్న అనంతరం ఉన్నతి, సీఐఎఫ్, స్త్రీనిధి తక్కువ వడ్డీకి వచ్చిన రుణాలను మాత్రమే వాడుకుని ఆదాయ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ప్రభుత్వం అందిస్తున్న వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ చేయూత, సున్నా వడ్డీ పథకాలతో పాటు వీధి వ్యాపారులు, చిల్లర వర్తకులకు వడ్డీ లేకుండా ప్రభుత్వం అందిస్తున్న జగనన్న తోడు రుణాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. మహిళా రైతులతో ఉత్పత్తిదారుల సంఘాలుగా ఏర్పాటు చేయించి, వారికి బ్యాంకు అనుసంధానం కల్పించాలని సిబ్బందికి ఆదేశించారు. క్లస్టర్ కో ఆర్డినేటర్ చంద్రరావు, వీవో ఏలు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరిస్తాం

- గాంధీనగర్‌లో 'మన వార్డు–మన ఎమ్మెల్యే'

నరసన్నపేట: ఎన్ని సమస్యలు పరిష్కరించినా మరిన్ని ఉత్పన్నం అవుతున్నాయని.. అన్నింటినీ ప్రాధాన్యతాక్రమంగా పరిష్కరిస్తామని నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ అన్నారు. మేజరు పంచాయతీ గాంధీనగర్‌లో శుక్రవారం మన వార్డు–మన ఎమ్మెల్యే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా గాంధీనగర్, ప్రశాంతినగర్ వాసులతో సమావేశమయ్యారు. రోడ్డు మూడవ వార్డులో డ్రైనేజీ సదుపాయం కల్పించాలని, నాలుగో వార్డులో ఇప్పిలి జగన్నాథరావు ఇంటి నుంచి పండిట్ సత్యన్నారాయణ ఇంటి వరకూ రోడ్డు, ఇంటింటికీ కుళాయిలు వేయాలని గొట్రాపు చండీశ్వరరావులు కోరగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కాగా ఈ వీధికి చెందిన టీడీపీ కార్యకర్తలు మెండ గీతారాణి, పచ్చమట్ల సన్యాశిరాజులకు కండువా వేసి వైఎస్సార్‌సీపీలోకి ఎమ్మెల్యే ఆహ్వానించారు. కార్యక్రమంలో ఎంపీపీ ఆరంగి మురళి, జెడ్పీటీసీ మాజీ సభ్యులు చింతు రామారావు, సర్పంచ్ బూరల్లి శంకర్, ఉప సర్పంచ్ ఎస్ కృష్ణబాబు, ఎంపీటీసీ సభ్యులు నేతింటి రాజేశ్వరరావు ఉన్నారు.

150 పనిదినాల కల్పనకు చర్యలు



మాట్లాడుతున్న ఏపీడీ శైలజ

మెళియాపుట్టి: ఆర్‌వోఎఫ్‌ఆర్ పట్టాలు ఇచ్చిన వారికి 150 పనిదినాలు కల్పించడానికి కసరత్తు చేయాలని టెక్కలి ఉపాధి హామీ పథకం ఏపీడీ శైలజ అన్నారు. మండల కేంద్రంలోని ఉపాధి కార్యాలయంలో సిబ్బందితో శుక్రవారం సమీక్షించారు. మండలంలో సుమారు 4,200 మంది పట్టాదారులు ఉన్నారని.. మరోసారి క్షేత్రస్థాయిలో క్రాస్‌చెక్ చేయాలని ఐటీడీఏ పీవో కల్పనాకుమారి ఆదేశించారన్నారు. నాలుగు రోజుల్లోగా పూర్తిడేటాను అందజేయాలని సిబ్బందికి సూచించారు. దీనివలన గిరిజన కుటుంబాలు 150 రోజుల ఉపాధి పనిదినాలు పొందుతారన్నారు. ఏపీవో రవి, ఈసీ ఆదినారాయణ రెడ్డి, సీవోలు అనిల్, ప్రకాష్, పున్నయ్య ఉన్నారు.

నేడు కోర్టు ఆవరణలో ఉచిత వైద్యశిబిరం

ఆమదాలవలస: స్థానిక సివిల్ జడ్జికోర్టు ఆవరణలో బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం ఉదయం ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని బార్ అసోసియేషన్ అధ్యక్షురాలు కణితి విజయలక్ష్మిభాయ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాగోలు జెమ్స్ ఆస్పత్రి వైద్యులు సౌజన్యంతో శిబిరాన్ని నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. పరిసర ప్రాంతాలకు చెందిన ప్రజలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ప్రజల చెంతకే పాలన



నరసన్నపేట:కోవెలవీధిలో లబ్ధిదారులకు సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్, సీఈసీ సభ్యురాలు పద్మప్రియ తదితరులు

- నరసన్నపేట ఎమ్మెల్యే కృష్ణదాస్
- కోవెల వీధిలో 'గడప గడపకు మన ప్రభుత్వం'

నరసన్నపేట: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి హయాంలో ప్రజల చెంతకే పాలన చేరువైందని నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ అన్నారు. అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలను అందజేస్తున్నామన్నారు. మేజరు పంచాయతీ నరసన్నపేటలోని కోవెలవీధితో పాటు పరిసర ప్రాంతాల్లో 'గడప గడపకు మన ప్రభుత్వం'కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ సీఈసీ సభ్యురాలు ధర్మాన పద్మప్రియతో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. అలాగే వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కృష్ణదాస్ మాట్లాడుతూ.. గడప గడపకు కార్యక్రమంలో తమ దృష్టికి వచ్చిన సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. ప్రాధాన్యతా క్రమంలో సమస్యలను పరిష్కరిస్తున్నట్టు చెప్పారు. కాగా ప్రభుత్వ ఆస్పత్రికి చెందిన మురుగు నీరు కోవెల వీధిలోకి వస్తుండడంతో బావులు, బోరు నీరు కలుషితం అవుతోందని పలువురు మహిళలు ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేయగా.. వారం రోజుల్లో సమస్యను పరిష్కరిస్తామని హామీ నిచ్చారు. ప్రజలందరూ మళ్లీ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహనరెడ్డిని, నరసన్నపేటలో తనను గెలిపించాలని కోరారు. ఎమ్మెల్యే దంపతులకు పంచాయతీ ఉప సర్పంచ్ ఎస్.కృష్ణబాబు సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ ఆరంగి మురళి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు చింతు రామారావు, నరసన్నపేట సర్పంచ్ బూరల్లి శంకర్, పార్టీ నాయకులు కేసీహెచ్‌బీ గుప్త, సురంగి నర్సింగరావు, పాగోటి రాజారావు, చీపురు కృష్ణ, సదాశివునికృష్ణ, పి.సాయిప్రసాద్, రమణ సాహు, గనగళ్ల శ్రీను, పాగోటి అప్పాజీ, సవర శైలజ, ఆర్.బుజ్జి, నేతింటి రాజేశ్వరరావు ఉన్నారు.

నేడు లచ్చుమన్నపేటలో..

పంచాయతీ పరిధిలోని లచ్చుమన్నపేటలో శనివారం సాయంత్రం నాలుగు గంటల నుంచి 'గడప గడపకు మన ప్రభుత్వం'కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు ఎంపీపీ ఆరంగి మురళి, సర్పంచ్ బూరల్లి శంకర్, ఎంపీటీసీ సభ్యుడు వైశ్యరాజు కేశవరాజులు తెలిపారు.

సంక్షేమ సారథి సీఎం జగన్:ఎమ్మెల్యే రెడ్డి శాంతి

పాతపట్నం: సంక్షేమ సారథి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. మండలంలోని కొండలపేట, జేసీపేట, గొల్లపేట, బి.గోపాలపురం గ్రామాల్లో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. అధికారులు, గ్రామ వలంటీర్లు, సచివాలయ కన్వీనర్లతో కలిసి ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం నాలుగేళ్లలో అందించిన సంక్షమ పథకాలను ప్రజలకు వివరించారు. చేకూరిన లబ్ధిని తెలియజేసి అందుకు సంబంధించిన బుక్‌లెట్‌ను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో సంక్షేమ పథకాల కోసం కార్యాలయాల చుట్టూ ప్రజలు తిరిగేవారని.. ప్రస్తుతం ఇంటి ముంగిటకే వచ్చి సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా రాష్ట్రంలో ఆదర్శ పాలన కొనసాగుతోందన్నారు. సంక్షేమ పథకాలన్నీ మళ్లీ అందాలంటే సీఎంగా జగన్‌ను మరోసారి గెలిపించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్ సూర్యం, వైఎస్ ఎంపీపీ ఎస్.ప్రదీప్, వై.ఎస్సార్‌సీపీ నాయకులు పి.రంజిత్, శ్రీనివాసరావు, ఢిల్లీశ్వరరావు, సత్యం, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.



పాతపట్నం:కొండలపేటలో ప్రజలకు సంక్షేమాన్ని వివరిస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

'స్థానిక' ఉప ఎన్నికలకు సర్వం సిద్ధం



సారవకోట: తరలివెళ్తున్న పోలింగ్ సిబ్బంది



బూర్జ: పెద్ద లంకాంలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు

సారవకోట: మండలంలోని బద్రి పంచాయతీ సర్పంచ్ ఉప ఎన్నిక శనివారం జరగనుంది. దీని కోసం అంతా సిద్ధం చేసినట్లు ఎంపీడీవో రేణుక శుక్రవారం తెలిపారు. బరిలో ముగ్గురు అభ్యర్థులు ఉన్నారని.. ఎన్నికల అధికారిగా సీహెచ్ భీమారావును ఉన్నతాధికారులు నియమించినట్లు పేర్కొన్నారు. 1248 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారని.. దీని కోసం మూడు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. కాగా సిబ్బంది పోలింగ్ నిర్వహణ కోసం ఎన్నిక సామగ్రితో శుక్రవారం గ్రామానికి తరలివెళ్లారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తుగా 144 సెక్షన్ విధించినట్లు స్థానిక ఎస్ఐ అప్పారావు తెలిపారు.

పెద్దలంకాం గ్రామంలో..

బూర్జ: పెద్దలంకాం సర్పంచ్ ఉప ఎన్నికను ప్రశాంతంగా నిర్వహించేందుకు సర్వం సిద్ధం చేసినట్లు ఎంపీడీవో ఎం.రవీంద్రబాబు, తహసీల్దార్ ఎస్.రమణారావు, ఎస్సై బి.అశోక్‌బాబు చెప్పారు. ఎన్నిక కోసం సిద్ధం చేసిన పోలింగ్ కేంద్రాన్ని శుక్రవారం పరిశీలించారు. ఎన్నిక నేపథ్యంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశామని ఎస్సై అశోక్‌బాబు తెలిపారు. గ్రామంలో 144 సెక్షన్ అమల్లో ఉంటుందన్నారు.

వార్డు స్థానాలకు..

నరసన్నపేట: కోమర్తి, మాకివలస పంచాయతీల పరిధిలోని రెండు వార్డు స్థానాలకు జరగనున్న ఉప ఎన్నికల కోసం ఏర్పాటు చేశామని ఎంపీడీవో మధుసూదనరావు తెలిపారు. మాకివలసలో 178 ఓట్లు ఉండగా పైల సింహాచలం, బుద్దల వినోద్ కుమార్, కోమర్తిలో 156 ఓట్లు ఉండగా.. దూసి శ్రావణకుమార్, లబ్బ రాజారావులు పోటీలో ఉన్నారన్నారు. ఈమేరకు సచివాలయాల్లో పోలింగ్ కోసం ఏర్పాట్లు చేశామని.. ఉదయం ఏడు నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ పోలింగ్ జరుగుతుందన్నారు. మధ్యాహ్నం రెండు గంటల తరువాత కౌంటింగ్ నిర్వహించి ఫలితాలు వెల్లడిస్తామన్నారు. పోలింగ్, కౌంటింగ్ సజావుగా నిర్వహించేందుకు గ్రామస్తులు సహకరించాలని కోరారు. ఒక్కో పోలింగ్ కేంద్రానికి ముగ్గురు చొప్పున సిబ్బందిని నియమించామన్నారు.



నరసన్నపేట: పోలింగ్ సిబ్బందికి సామగ్రి అందిజేస్తున్న ఎంపీడీఓ మధుసూదనరావు

సుభాష్ చంద్రబోస్‌కు ఘనంగా నివాళి



నేతాజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

పాతపట్నం:స్వాతంత్ర్య సమరయోధుడు నేతాజీ సుభాస్ చంద్రబోస్ 78వ వర్ధంతిని స్థానిక ఒరియా ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం నిర్వహించారు. హెచ్ఎం భీమ్‌సన్ పండా అధ్యక్షతన శ్రీరామరాజు చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో నేతాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రీతి పాడి, కె.నవీన్, ఎం.గోవిందరావు, రెహమాన్ పాల్గొన్నారు.

వాషింగ్ మిషన్ వితరణ



వాషింగ్ మిషన్‌ను అందజేస్తున్న దృశ్యం

హిరమండలం: ప్రేమ సాయి వృద్ధాశ్రమానికి బి.ఆర్.అంబేడ్కర్ విశ్వవిద్యాలయం ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త ఎం.అనురాధ సోదరిమణులు వాషింగ్ మిషన్‌ను వితరణ చేశారు. శశికళ, వరలక్ష్మి, తులసీరత్నం, భారతి, సుజాత, సోదరుడు గోపాలకృష్ణ సహకారంతో వారి తల్లిదండ్రుల జ్ఞాపకార్థం ఆశ్రమ వాసులకు రూ.20 వేల విలువైన వాషింగ్ మిషన్‌ను శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో ఆశ్రమ కోఆర్డినేటర్ గోవిందశర్మ, చంటిమాస్టర్, జయరాం పాల్గొన్నారు.

సక్రమంగా ఓటర్ల సర్వే

ఎల్.ఎన్.పేట: ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు చేపట్టిన ఓటర్ల జాబితా ప్రకారం ఇంటింటికీ వెళ్లి సక్రమంగా ఓటర్ల సర్వేను శతశాతం చేపట్టాలని తహసీల్దారు ఆర్.అప్పలరాజు అన్నారు. సిద్ధాంతం, వలసపాడు గ్రామాల్లో జరుగుతున్న ఓటర్ల సర్వేను శుక్రవారం పరిశీలించారు. ఓటర్ల జాబితా ప్రాప్తికి ఇంటింటికీ వెళ్లి ఓటర్ల వివరాలు తెలుసుకోవాలన్నారు. కుటుంబ సభ్యుల అనుమతితో మృతి చెందిన, వివాహం జరిగి అత్తవారి ఇంటికి వెళ్లిన వారి ఓట్లను తొలగించాలన్నారు. 2024 జనవరి ఒకటో తేదీ నాటికి 18 సంవత్సరాల వయసు నిండిన వారు ఓటు హక్కు పొందేందుకు దరఖాస్తులు చేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. ఒక డోర్ నంబర్‌లో పది కంటే తక్కువ ఓట్లు మాత్రమే ఉండాలని సూచించారు. ఓటర్ల జాబితాను పోలింగ్ బూత్ ఏజెట్లు, రాజకీయ పార్టీ నాయకుల సమక్షంలో చదివి వినిపించి తుది జాబితా సిద్ధం చేయాలన్నారు.

ఇనాం భూముల సమస్యపై గ్రామసభ



రైతులతో మాట్లాడుతున్న తహసీల్దార్ గణపతిరావు

ఆమదాలవలస: ఆమదాలవలస మున్సిపాలిటీ పరిధిలోని 22వ వార్డు వెంకయ్యపేటలో ఇనాం భూముల సమస్యపై ఆమదాలవలస తహసీల్దార్ ఎస్.గణపతిరావు ఆధ్వర్యంలో శుక్రవారం రైతులతో గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇనాం దారుల వారసులు పట్టాదారు పాసుపుస్తకాల కోసం జిల్లా ఉన్నతాధికారులకు, మండల రెవెన్యూ కార్యాలయానికి దరఖాస్తు చేసుకున్నారని రైతులకు తెలిపారు. ఆ గ్రామ రెవెన్యూకి సంబంధించి 308 ఎకరాల ఇనాం భూములను సాగు చేస్తున్నారన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఇనాం దారుడుకు ఎకరాకు 33 1/2 సెంట్లు, రైతుకు 66 1/2 సెంట్లు చెందాల్సి ఉందని వివరించారు. ఈ ప్రకారం 208 ఎకరాలు రైతులకు 100 ఎకరాలు ఇనాం దారుల వారసులకు చెందుతుందన్నారు. దీనిపై తమ అభిప్రాయాలు తెలపాలని రైతులను తహసీల్దార్ కోరారు. దీంతో రైతులు మాట్లాడుతూ.. వంద సంవత్సరాల నుంచి ఈ భూములను తామే సాగు చేస్తున్నామని.. ఇనాములకు ఇచ్చేది లేదని తేల్చి చెప్పారు. దీంతో గ్రామ సభ ముగించారు. ఈ గ్రామ సభలో మండల సర్వేయర్ బొడ్డేపల్లి గోపి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శిరీష, న్యాయవాది మొదలవలస రాజేంద్రనాయుడు పాల్గొన్నారు.

సింహద్వారం నిర్మాణానికి శంకుస్థాపన రేపు



మాట్లాడుతున్న అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు బాలకృష్ణ

ఆమదాలవలస: ఆమదాలవలస పట్టణ గ్రామ దేవత పాలపోలమ్మ అమ్మవారి ఆలయం వద్ద ప్రధాన సింహద్వారం నిర్మాణానికి ఈ నెల 20వ తేదీ ఉదయం 11 గంటలకు శంకుస్థాపన చేయనున్నట్లు ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు కూన బాలకృష్ణ, జె.కె.వెంకుబాబులు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆలయం ఆవరణలో కార్యవర్గ సమావేశం నిర్వహించి నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. అమ్మవారికి స్వర్ణ కిరీటం తయారీకి, ఆలయ అభివృద్ధికి విరాళాలు ఇవ్వాలనుకునేవారు కమిటీ సభ్యులను సంప్రదించి ధన, బంగారం రూపంలో సహకరించాలని కోరారు. సమావేశంలో కార్యవర్గ సభ్యులు బలివాడ రాజేష్‌శర్మ, కుసుమంచి శ్యాంప్రసాద్, గుడ్లబాబు, కె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కాలి బాటలతో పంటకు మేలు

ఎల్.ఎన్.పేట: ఖరీఫ్ వరిసాగు చేస్తున్న రైతులు ఇప్పటికే వరి ఎదలు వేసుకున్న పొలాలతో పాటు ప్రస్తుతం నాట్లు వేస్తున్న పొలాల్లోను కాలిబాటలు వేసుకోవాలని ఏఓ పైడి లతశ్రీ సూచించారు. కాలి బాటలు వేసుకోవటం వలన పంటకు మేలు జరుగుతుందన్నారు.

తూర్పు, పడమర దిశలకు 20 సెంటీమీటర్ల వెడల్పుతో రెండు మీటర్లకు ఒక కాలిబాట ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఇలా చేయటం వలన మొక్క మొదలు వరకు వెలుతురు, గాలి తగిలి మొక్కలు ఏపుగా పెరగటంతో పాటు తెగుళ్ల నివారణ సాధ్యం అవుతుందని అన్నారు.

మగ్గం వర్క్‌తో అదనపు ఆదాయం



మాట్లాడుతున్న సుకుమార్

ఆమదాలవలస రూరల్: మహిళలకు బ్లాక్ పెయింటింగ్, మగ్గం వర్క్‌పై నైపుణ్యాభివృద్ధి శిక్షణ ద్వారా అదనపు ఆదాయం వస్తుందని సిడ్బి బ్యాంక్ మేనేజర్ సుకుమార్ అన్నారు. శ్రీనివాసాచార్యులపేట చేనేత కార్యాలయంలో సిడ్బి బ్యాంక్ ఆధ్వర్యంలో శిక్షణ శిబిరాన్ని శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళలకు శిక్షణ ఎంతగానో ఉపయోగపడుతోందన్నారు. శిక్షణ అనంతరం యూనిట్ ఏర్పాటు చేసుకుంటే మంచి ఆదాయం పొందవచ్చునని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో మహిళలకు బ్లాక్ పెయింటింగ్, మగ్గం వర్క్‌ల తయారీకి మంచి గిరాకీ ఉందన్నారు. శిక్షణను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆర్డ్స్ సంస్థ డైరెక్టర్ ఎస్.సన్యాసిరావు, చేనేత కంపెనీల సీఈవోలు బి.శంకరరావు, సూర్యనారాయణ, అప్పలనాయుడు, వాసు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికి మంచినీటి కల్పనే ధ్యేయం



కుళాయి పనుల శంకుస్థాపన ఫలకాన్ని ఆవిష్కరిస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

- స్పీకర్ తమ్మినేని సీతారాం
- జలజీవన్ మిషన్ పనులకు శంకుస్థాపన

సరుబుజ్జిలి: ప్రతి ఇంటికి స్వచ్ఛమైన నీటిని అందించడమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారని స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. శాస్త్రులపేట, కె.జె.పేట, బురిడివలస, మర్రిపాడు, చినషళంత్రి గ్రామాల్లో ఒక కోటీ 36 లక్షల 50 వేల రూపాయల అంచనాతో జలజీవన్ మిషన్ పథకం ద్వారా నిర్మించనున్న ఇంటింటికీ మంచినీటి కుళాయి పనులకు శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అత్యంత అవసరమైన ఆహారం, మంచిగాలి, స్వచ్ఛమైన నీటిని వినియోగించే వారే ఆరోగ్యవంతులుగా ఉంటారన్నారు. గత పాలకుల హయాంలో బిందెడునీటి కోసం కిలోమీటర్లు దూరం వెళ్లాల్సిన దుర్భర పరిస్థితులు ఉండేవని గుర్తు చేశారు. అధికంగా ప్రజలు ఫ్లోరైడ్‌నీటిని తాగడం వలన గుండె, కిడ్నీ వ్యాధుల బారిన పడుతున్నారన్నారు. వీటికి చెక్ చెప్పే లక్ష్యంతోనే శుద్ధి చేసిన నీటిని ప్రతి ఇంటికి అందించడమే ప్రధాన లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందన్నారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాహ్వానితుడు కిల్లి వెంకటగోపాల సత్యనారాయణ, జెడ్పీటీసీ సభ్యుడు సురవరపు నాగేశ్వరరావు, మండల పార్టీ కన్వీనర్ బెవర మల్లేశ్వరరావు, కొత్తకోట పీఏసీఎస్ చైర్మన్ కొవిలాపు చంద్రశేఖర్, రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ ఎల్ల ఈశ్వరరావు, విజయరాంపురం, షళంత్రి, చినకాగితాపల్లి సర్పంచ్‌లు బెండి అప్పలనాయుడు, బత్తిని వరలక్ష్మి, మునకాల అన్నపూర్ణ, జేసీఎస్ మండల కన్వీనర్ అత్తులూరి రవికాంత్, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ సూర్యనారాయణ, పలువురు ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో శ్రావణ పూజలు



సారవకోట: గొర్రిబంద సంతోషిమాత ఆలయంలో సామూహిక కుంకుమార్చనలు



నరసన్నపేట: ఉమామహేశ్వరి గుడిలో అభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్

నరసన్నపేట: శ్రావణమాస సందడి ప్రారంభమైంది. మొదటి శ్రావణ శుక్రవారం కావడంతో ఆలయాలు కిటకిటలాడాయి. పట్టణంలోని శివాలయాలు, అమ్మవారి ఆలయాలు, సంతోషిమాత గుడి, చౌడేశ్వరి అమ్మవారి గుడి వద్ద మహిళలు ప్రత్యేక పూజలు చేపట్టారు. స్థానిక ఉమామహేశ్వరి ఆలయంలో ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ ప్రత్యేక పూజలు, అభిషేకం చేశారు. జిల్లా ప్రజలందరికీ మేలు జరగాలని కోరుకున్నట్లు చెప్పారు.

వెంకటేశ్వరాలయంలో అమ్మవారికి గాజులతో అలంకరణ

నరసన్నపేటలోని వేంకటేశ్వరాలయంలో అమ్మవారికి శ్రావణ శుక్రవారం సందర్భంగా గాజులతో అలంకరణ చేపట్టారు.అలంకరణకు 11,111 గాజులు వినియోగించినట్లు అర్చకులు సాయికృష్ణమాచార్యులు తెలిపారు.

సారవకోట: మండలంలోని పలు ఆలయాల్లో శ్రావణ మాస పూజలు ప్రారంభమైయ్యాయి. గొర్రిబంద గ్రామంలోని సంతోషిమాత ఆలయ ప్రాంగణంలో అర్చకులు సోమేశ్వరరావు మహిళలచే సామూహిక కుంకుమార్చనలు చేయించారు. అలాగే చీడిపూడి వేంకటేశ్వర స్వామి ఆలయంలో అర్చకులు రామానుజాచార్యులు భక్తులతో సామూహిక కుంకుమార్చనలు జరిపించారు.



నరసన్నపేట: గాజుల అలంకరణలో అమ్మవారు

ప్రకృతి వ్యవసాయంతో రైతుకు మేలు



వ్యవసాయ వనరుల కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

పాతపట్నం: ప్రకృతి వ్యవసాయ సాగు విధానంతో రైతులకు మేలు జరుగుతోందని పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. గోపాలపురం గ్రామంలో ప్రకృతి వ్యవసాయ వనరుల కేంద్రాన్ని శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా రైతులనుద్దేశించి మాట్లాడారు. విచక్షణా రహితంగా ఎరువులు, పురుగు మందులు వాడటం వలన భూమి లోపల పొరల్లో ఉండే రైతులకు మేలు చేసే మిత్ర పురుగులు మరణిస్తుండడంతోపాటు భూసారం దెబ్బతింటోందన్నారు. సేంద్రియ సాగు విధానంతో భూమి సారవంతంగా మారుతుందని, రసాయన ఎరువులు, పురుగు మందుల ఖర్చు తగ్గుతోందని వివరించారు. కార్యక్రమంలో మెంటర్ దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

కొత్తూరులో కుండపోత



కొత్తూరులో వర్షం కురుస్తున్న దృశ్యం

కొత్తూరు: కొత్తూరు మండలంలో శుక్రవారం కుండపోతగా వర్షం కురిసింది. దీంతో రోడ్లు, లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. వర్షం నీటితో పొలాలు చెరువులను తలపించాయి. హడ్డుంగి, మర్రిపాడు గెడ్డలు పొంగిపొర్లాయి. సుమారు రెండు గంటలు కురిసిన వర్షంతో జనజీవనం కొద్దిసేపు స్తంభించింది. వంగ, పత్తి, చిక్కుడుతో పాటు పలు రకాల పంటలు వర్షం నీటిలో మునిగిపోవడంతో రైతులు ఆందోళన చెందారు.

ఖాళీ కొబ్బరి బొండాలతో అవస్థలు



పేరుకుపోయిన ఖాళీ బొండాలు

బూర్జ: మండల కేంద్రం బూర్జ గ్రామంలో రోడ్ల పక్కన ఖాళీ కొబ్బరి బొండాలు పేరుకుపోయి ఉన్నాయి. దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వర్షాలు కురుస్తుండడంతో బొండాలు ఉంటున్న ప్రదేశాల్లో నీరు నిలిచిపోయి దోమలు వృద్ధి చెందుతున్నాయి. దీంతో రోగాలు ప్రబలే ప్రమాదం ఉందని స్థానికులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.